

మన భానుప్రభ

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

శనివారం 31 అక్టోబర్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2



పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు స్కిల్ ట్రైనింగ్



భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

జిల్లాలోని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను సర్వే ద్వారా గుర్తించి, వాటికి అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కోర్సులు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎన్ఐఈఎల్ఐటి, ఆర్సెట్టి, సిఐటీడీ, టాస్క్ తదితర సంస్థల సమన్వయంతో యువతకు శిక్షణ, ధ్రువీకరణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. స్థానిక పరిశ్రమలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. టాస్క్ సమన్వయంతో జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం అందుబాటులోకి వస్తే యువతకు విస్తృతంగా నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో డిఆర్వో డి. ప్రేమ్ రాజు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఎం.ఎ. భారతి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సత్యనారాయణ రెడ్డి, ఎన్ఐఈఎల్ ఐటి ప్రతినిధి డాక్టర్ లక్ష్మణ్, ఎన్ఎస్డీసి ప్రతినిధి ప్రతాప్ చారి, ఎస్బిఐ ప్రతినిధి వాల్యా నాయక్, సూర్యాపేట పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ లెక్చరర్ వజ్రయ్య, హుజూర్‌నగర్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



భానుపురి /చివ్వేంల

గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా నాగు నాయక్,ఆధ్వర్యంలో గిరిజన గళశీ తండాలలో నిద్ర కార్యక్రమం లోగురువారం భాగంగా మండల పరిధిలోని బద్యతండ లో నిద్ర చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డిక్లరేషన్ లో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర క్యాబినెట్ లో లంబాడీలకు మంత్రి పదవి లేకపోవడం లంబాడీలను అవమానించడమే అని అన్నారు. ఎస్సి, ఎస్టీ బీసీలకు యూనివర్సిటీలలో రిజర్వేషన్ లను కల్పించాలని, అన్ని రంగాల్లో గిరిజనులకు కేటాయించిన హక్కులను సాధించడమే కోసమే గిరిజన గళశీ తండాలలో నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లంబాడీలు మాట్లాడే గోర్ బోలి భాషను 8వ షెడ్యూల్ లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నడిబొడ్డులో సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని ఏర్పాటుతో పాటు ట్రైబల్ మ్యూజియం నిర్మించాలన్నారు. గిరిజన సాధు సంతువులకు ధూపదీప నైవేద్యంతో పాటు గౌరవ వేతనాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ నీ అభివృద్ధి పదంలో నడిపిస్తాం



భానుపురి/సూర్యాపేట టౌన్

ప్రజా ప్రభుత్వంలో సూర్యాపేట పట్టణంలోని అన్ని వార్డులలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు అమలు చేస్తామని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శుక్రవారం నాడు సూర్యాపేట పట్టణంలోని నాలుగో వార్డు నేత్యా తండాలో 5 లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో నిర్మాణం చేయనున్న సిసి డ్రైన్ కు ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో 4 వార్డుకు 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయి, నిర్మాణం జరుగుతున్నాయని చెప్పారు. బోర్ వెల్ తో పాటు పైపులైన్ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పారు. అధికార ప్రతిపక్ష కౌన్సిలర్లు అనే తేడా లేకుండా అన్ని వార్డులలో సమానంగా అభివృద్ధి చేస్తున్నామని, సూర్యాపేట మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి వున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ బుక్యా జ్యోతి లింగ నాయక్, ఎ ఇ తిరుమలయ్య, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రముఖులు వాజిద్ మియా, సలీం ఆఫ్ ఖాన్, శ్రీనివాసరెడ్డి, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ

-ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రానున్న శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చేపడుతున్నట్లు వెల్లడించారు.

-మూడేండ్ల క్రితం డిగ్రీ పూర్తి చేసి ఉండాలి

2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 31 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఇందు కోసం ఫారం-18 సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు.

-ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు

పట్టభద్రులు తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి వెబ్‌సైట్ https://ceotelangana.nic.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో ఫారం-18ను విద్యార్హత ధ్రువపత్రాలతో జతచేసి సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారి, నియమిత అధికారి కార్యాలయాల్లో అందజేయవచ్చన్నారు. పోస్టు ద్వారా కూడా దరఖాస్తులు పంపే అవకాశం ఉందని వివరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఏ విధానంలో దరఖాస్తు చేసినా విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలు తప్పనిసరిగా సమర్పించాలని స్పష్టం చేశారు.

-అర్హులందరూ నమోదు చేసుకోవాలి

జిల్లాలో అర్హత కలిగిన పట్టభద్రులెవరూ ఓటరు నమోదుకు దూరం కావొద్దని కలెక్టర్ కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, పట్టభద్రుల సంఘాలు, విద్యాసంస్థలు, ఉద్యోగ సంఘాలు, ప్రజాప్రతినిధులు ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. దరఖాస్తులతో వచ్చిన విద్యార్హత ధ్రువపత్రాలను అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హమైన దరఖాస్తులను గడువులోగా



పరిష్కరిస్తారని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, క్షేత్ర స్థాయి ధ్రువీకరణ, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై సందేహాలు, అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని కలెక్టర్ కోరారు.

చెకుముకి సంబరాలను జయప్రదం చేయాలి

భానుపురి /సూర్యాపేట టౌన్



విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ, విజ్ఞానంపై ఆసక్తిని కలిగించే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సంబరాలను జయప్రదం చేయాలని శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి సేవాసమితి కార్యాలయం లో జన విజ్ఞాన వేదిక సూర్యాపేట జిల్లా నాయకులు బచ్చు పురుషోత్తంను మర్యాద పూర్వకంగా కలిసి చెకుముకి సంబరాల నిర్వహణ, వాటి ఉద్దేశాలు, విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా బచ్చు పురుషోత్తం పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలలోని విషయ పరిజ్ఞానంతో పాటు శాస్త్రీయ ఆలోచనా విధానం, ప్రశ్నించే తత్వం, పరిశీలనాశక్తి ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థుల్లో మూఢనమ్మకాలను తొలగించి, శాస్త్రీయ అవగాహనను పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక నిరంతర కృషి అభినందనీయమని తెలిపారు. చెకుముకి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడం, ప్రయోగాత్మక విద్యను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు సహకరించాలని జన విజ్ఞాన వేదిక నాయకులు కోరారు. విద్యార్థులలో విజ్ఞాన వికాసానికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని బచ్చు పురుషోత్తం కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కలకుంట్ల సైదులు, కోశాధికారి డాక్టర్ క్రాంతి కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు గొల్లమూడి రమేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు దేవరశెట్టి నాగరాజు, గౌరవాధ్యక్షులు తల్లాడ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షుడిగా పిట్టల మహేష్ ముదిరాజ్

భానుపురి

తెలంగాణ రక్షణ సేన నూతనకల్ మండల అధ్యక్షుడిగా పిట్టల మహేష్ ముదిరాజ్‌కు బాధ్యతలు అప్పగించారు. తనపై నమ్మకం ఉంచి ఇంతటి కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద తతో నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తానని పేర్కొ న్నారు.నూతనకల్ మండలంలోని యువతను, ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తనపై విశ్వాసం ఉంచిన కల్వకుంట్ల కవిత నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, తెలంగాణ రక్షణ సేన ఆశయ సాధన కోసం కృషి చేస్తానని పిట్టల మహేష్ ముదిరాజ్ వెల్లడించారు.

జాతీయ ఐక్యత కోసం.. ఐక్యత పరుగు కార్యక్రమం



భానుపురి/సూర్యాపేట

అక్టోబర్ 31వ తేదీ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా నేడు ఉదయం 6 గంటలకు ఎస్పీ ఇంజనీరింగ్ కాలేజ్ చౌరస్తా నుండి మినీ ట్యాంక్ బండ్ వరకు జిల్లా కేంద్రంలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఐక్యత కోసం పరుగు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నా మని జిల్లా ఎస్పీ నరసింహా తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లో పరిధిలో ఈ రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం సంబంధిత పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది కావున స్థానిక పౌరులు యువత అధిక సంఖ్యలో పాల్గొని జాతి ఐకమత్యం చాటాలని కోరారు. వేదిక: ఎస్పీ ఇంజనీరింగ్ కాలేజ్ చౌరస్తా మార్గం: ఎస్పీ ఇంజనీరింగ్ కాలేజ్ చౌరస్తా ? సంతోష్ బాబు చౌరస్తా ? మినీ ట్యాంక్ బండ్ ఈ కార్యక్రమం ద్వారా సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి సేవలను స్మరించుకోవడంతో పాటు, దేశీయ ఐక్యతకు అంకితభావాన్ని వ్యక్తపరచే అవకాశం కలుగుతుంది. అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

రోడ్డు దురాక్రమణ జరుగుతోందా



భానుపురి సూర్యాపేట

పట్టణంలోని 9వ వార్డు ఎన్టీఆర్ కాలనీ పార్కు సమీపంలోని ఒక ఇంటి ముందు రోడ్డు స్థలాన్ని ఆక్రమించి పిల్లర్లు ఏర్పాటు చేస్తున్నారనే ఆరో పణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. గతంలో స్థానిక కౌన్సిలర్ చెప్పినా వినకుండా రోడ్డుకు సంబంధించిన స్థలంలో వ్యక్తిగత నిర్మాణం చేపడుతూ పిల్లర్లతో ప్రహరీ నిర్మాణానికి ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు పేర్కొ ంటున్నారు.ప్రభుత్వ రికార్డుల ప్రకారం రోడ్డుకు కేటా యించిన స్థలాన్ని వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకోవడం నిబంధ నలకు విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్మాణం కారణంగా రోడ్డు స్థలం తగ్గిపోయి భవిష్యత్తులో కాలనీవాసులకు రాకపో కల్లో ఇబ్బందులు ఎదు రయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఆ స్థలం రోడ్డు పరిధిలోకి వస్తుందా.. నిర్మా ణానికి అనుమతులు ఉన్నా యా.. అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థా యిలో పరిశీలన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అమరవీరుల స్మారక కొవ్వొత్తుల ర్యాలీ





భానుపురి/సూర్యాపేట టౌన్

మరవీరుల సంస్కరణ దినోత్సవం పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పోలీసు అమరవీరులను స్మరించు కుంటూ సూర్యాపేట జిల్లా పోలీసు కార్యా లయం నందు అమరుల స్మారక కొవ్వొత్తుల ర్యాలీ నిర్వ హించడం జరిగినది ఈ కార్యక్రమంలో ఎస్పీ నం ంసింహ ప్రారంభించి పాల్గొన్నారు. కోవ్వోత్తులు వెలిగి ంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది, ఆర్మీ జవాను, కేంద్ర బలగాల జవానులు 24 గంటలు విధులు నిర్వహిస్తూ దేశాన్ని రాష్ట్రాన్ని కాపాడుతున్నారని సమా జంలో శాంతి భద్రతల పరిరక్షణకు సిబ్బంది అహర్ని శలు కృషి చేస్తున్నారని అన్నారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయక పోరాడిన అమర వీరులు బడే సాహెబ్, లింగయ్య, మహేశ్వర్, కలమ లాకర్ ల యొక్క త్యాగాలను ఆయన కొనియా డారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, ఆర్మ్డ్ డీఎస్పీ నరసింహ చారి, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, సైబర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ శివ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్ఎస్ఐ లు, పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, సిబంది పాల్గొన్నారు.

భూగోళాన్ని వణికిస్తున్న ఎల్ నినో -- ప్రకృతి హెచ్చరిక.. మానవాళికి సవాల్!

భానుపురి/సూర్యాపేట

పరిచయం:- ప్రకృతి ప్రకోపిస్తే ప్రగతి చక్రాలు సైతం నిలిచిపోతాయి. భూగోళ వాతావరణ సమతుల్యతను ప్రభావితం చేస్తూ, ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తున్న ప్రకృతి వైపరీత్యాల్లో ఎల్ నినో ఒకటి. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే స్వల్ప ఉష్ణోగ్రత మార్పు ప్రపంచ వాతావరణ గతినే మార్చగలదు. సముద్రంలో ప్రారంభమయ్యే ఈ పరిణామం ఒకవైపు వరదలకు, మరోవైపు కరువులకు కారణమవుతూ, చివరకు రైతుల కన్నీళ్లకు, ప్రజల కష్టాలకు దారితీస్తోంది.

-ఎల్ నినో అంటే:

స్పానిష్ భాషలో ఎల్ నినో అంటే 'చిన్న బాలుడు' అని అర్థం. దక్షిణ అమెరికాలోని పెరూ తీర ప్రాంతంలో క్రిస్మస్ సమయంలో సముద్రపు నీరు అసాధారణంగా వేడెక్కడాన్ని అక్కడి జాలర్లు గమనించి ఈ పేరు పెట్టారు. భూమధ్యరేఖకు సమీపంలోని మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కి, ఆ పరిస్థితి కొంతకాలం కొనసాగడాన్ని ఎల్ నినో అంటారు.

-ఎల్ నినో ఏర్పడే విధానం:-

సాధారణ పరిస్థితుల్లో పసిఫిక్ మహాసముద్రంపై తూర్పు ేదిశ నైరుతి రుతుపవనాలపై పడే అవకాశం ఉంది. నుంచి పడమర దిశగా వాణిజ్య పవనాలు వీస్తాయి. ఇవి వేడి సముద్ర జలాలను ఆసియా, ఆస్ట్రేలియా వైపు నెడతాయి. ఫలితంగా అక్కడ వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. దక్షిణ అమెరికా తీరంలో సముద్రపు లోతుల్లోని చల్లని, పోషక విలువలున్న నీరు పైకి వస్తుంది. ఈ ప్రక్రియను 'అప్ వెల్లింగ్' అంటారు. అయితే ఎల్ నినో సమయంలో ఈ పవనాలు బలహీ నపడటంతో వేడి జలాలు తూర్పు దిశగా విస్తరిస్తాయి. దీనివల్ల సముద్ర ఉష్ణోగ్రతలు పెరిగి, గాలుల దిశ, వర్షపాత పంపిణీ, వాతావరణ పరిస్థితుల్లో గణనీయ మైన మార్పులు సంభవిస్తాయి.

-ప్రపంచంపై ఎల్ నినో ప్రభావం

1. వాతావరణంపై ప్రభావం: కొన్ని ప్రాంతాల్లో కుండ పోత వర్షాలు, వరదలు సంభవిస్తే, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన కరువులు ఏర్పడతాయి.
2. సముద్ర జీవులపై ప్రభావం: సముద్రంలో చల్లని నీటి ప్రవాహాలు తగ్గడంతో ప్లాంక్టన్ ఉత్పత్తి తగ్గుతుంది. ఫలితంగా చేపల సంపద దెబ్బతిని, మత్స్యకారుల జీవనోపాధి సంక్షోభంలో పడుతుంది.
3. భారతదేశంపై ప్రభావం: ఎల్ నినో ప్రభావం భారత వర్షపాతం తగ్గి వ్యవసాయం దెబ్బతింటుంది.
4. ఆర్థిక వ్యవస్థపై ప్రభావం: వ్యవసాయ ఉత్పత్తి తగ్గితే ఆహార ధరలు పెరిగి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలహీ నపడుతుంది.

-పరిష్కార మార్గాలు:

ఎల్ నినోను ఆపడం మన చేతుల్లో లేకపోయినా, దాని ప్రభావాన్ని తగ్గించుకోవడం మన చేతుల్లోనే ఉంది. వాతా వరణ అంచనాల ఆధారంగా రైతులకు ముం దస్తు హెచ్చరికలు, పంటల బీమా, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలను పునరుద్ధరించి వర్షపు నీటిని సంరక్షించాలి.

-ముగింపు:-

ఎల్ నినో ప్రకృతిలో సహజంగా సంభవించే వాతావరణ పరిణామం. అయితే పెరుగుతున్న భూతాపం దాని ప్రభావాలను మరింత తీవ్రతరం చేయవచ్చు. ప్రకృతిని కాపాడితేనే మానవాళి మనుగడ సాధ్యం.

ఇట్లు,
ఆరెశెట్టి రేవతీ గుప్తా, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర

-మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి



భానుపురి/కట్టంగూర్,

మండలం కురుమర్తి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, కట్టంగూర్ మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి ప్రారం భించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారుల కు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని, ధాన్యాన్ని బాగా ఆరబెట్టి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద నీడ, తాగునీరు, తార్పాలిన్లు వంటి అన్ని ప్రాథమిక వసతులు కల్పిం చాలని నిర్వాహకులను ఆదేశించారు. కట్టంగూర్ మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోనే ఐకేపీ కేంద్రాలు అందుబాటులోకి రావడం వల్ల రైతులకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు సమయం కలిసివస్తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకో వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కట్టంగూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకరబోయిన వెంకన్న, నకిరేకల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గుండు పరమేష్ గౌడ్, బండారు కృష్ణ, కురుమర్తి సర్పంచి దార సత్తెమ్మ బిక్షం, మాజీ సర్పంచులు గద్దపాటి దానయ్య, అయితగోని నారాయణ, బూరుగు శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయ కులు మిట్టపల్లి శివశంకర్, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, కుందారపు వెంకట్ రెడ్డి, నిమ్మనగోటి లింగస్వామి, మాద మమత సైదులుగౌడ్, జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డిపల్లి వీరస్వామి, ఏపీఎం నరహరి, ఐకేపీ ప్రతినిధులు, సెర్ప్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వివోఏలు, నాయ కులు, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

భానుపురి/ కట్టంగూర్,

సర్వేంద్రియాలలో కన్ను ఎంత ముఖ్యమో, ప్రజాస్వా మ్యంలో ఓటు హక్కు అంత కీలకమని, అలాంటి ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా చోరీ చేస్తోందని కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గత 12 ఏళ్ల మోదీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలు, ఆదివాసీలకు ఎలాంటి ప్రయోజనమూ చేకూరలేదని విమర్శించారు. దేశ ప్రజలందరూ బీజేపీ ప్రజావ్యతిరేక పాలనపై విసుగు చెందారని, ఓటమి భయంతోనే ఇలాంటి ఓటు చోరీ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐ, ఈడీ, సీఈసీ వంటి స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ ప్రభుత్వం తన స్వార్థ రాజకీయాల కోసం దుర్వినియోగం చేస్తోందని దుయ్యబట్టారు. ఓటు చోరీకి కారణమైన సీఈసీ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదని హెచ్చ రించారు. ఓటు హక్కును, దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ప్రతి ఓటును కాపాడు కుందాం – దేశాన్ని రక్షించుకుందాం అనే నినాదంతో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నవంబర్ 1న ఢిల్లీ లోని రాంలీలా మైదానంలో భారీ ధర్నా, ర్యాలీ నిర్వహి స్తున్నట్లు తెలిపారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లి కార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, నకిరేకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ వేముల వీరేశంల



పిలుపు మేరకు కట్టంగూర్ మండ లం, జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్ర తినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని దిగ్విజ యం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ సర్పంచ్ గద్దపాటి దానయ్య, పందెనపల్లి సర్పంచ్ కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ పొలిశెట్టి వెంకన్న, ఈదులూరు మాజీ సర్పంచ్ అయితగోని వెంకట్ నారాయణ, నాయకులు చింత రాందాస్, కొమ్మనబోయిన శంకర్, కురుమేటి యాదయ్య, దుప్పల్లి నాగయ్య పాల్గొన్నారు.